క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: శంకరగుప్తం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆదివారం ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ రాపాకా నంద కుమార్, మాజీ ఎంపీపీ ముత్యాల కాశి, చింతా కుమార్‌రాజా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి రూ.50 వేల విరాళం



ప్రభాకరరావుకు విరాళాన్ని అందిస్తున్న దాతలు

ఆలమూరు: స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపానికి ఆదివారం విరాళం అందజేత జరిగింది. ఈ మేరకు కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావుకు అతని నివాసంలో దాతలు కోలా వెంకటేశ్వరరావు, కుమారులు రూ. 50 వేలు విరాళం అందించారు. కాపు అభ్యుదయ సంఘానికి తమ వంతు తోడ్పాటును అందించిన దాతలను పలువురు గ్రామస్తులు కొనియాడారు. రామానుజుల శేషగిరిరావు, చల్లా నానాజీ, శిరిగినీడి పట్టాభి, శ్రీనతి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం



మానవ హక్కులపై నినదిస్తున్న విద్యార్థులు

రావులపాలెం: స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో విమెన్ అసోసియేషన్ ఫర్ జెండర్ ఈక్వాలిటీ (వెజ్)స్వచ్ఛంద సేవా సంస్థవారి ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెజ్ కన్వీనర్ పోతుమూడి శేషారత్నం మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్‌ను ఐక్యరాజ్య సమితి ఆమోదించిన డిసెంబర్ పదో తేదీని ఏటా మానవ హక్కుల దినోత్సవంగా జరుపుకొంటున్నామని తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు హక్కుల అణచివేత లేని సమాజ నిర్మాణం కోసం నిరంతరం పోరాడాలన్నారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

డిగ్రీ కళాశాలలో..

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1, 2, డబ్ల్యూఈసీ సారథ్యంలో మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి మనిషికి స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం కావాలని నినదించారు. డబ్ల్యూఈసీ కో ఆర్డినేటర్ శైలజ, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు నల్లి రాజు, శ్రీరామమూర్తి, భాస్కరరావు, డాక్టర్ చంద్రబోస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు



గుడిమెళ్లంకలో కాలువ పనులు పరిశీలిస్తున్న చైర్మన్ శివకుమార్

మలికిపురం: మండలంలో ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ అధికారులకు సూచించారు. గుడిమెళ్లంకలో జరుగుతున్న వేప చెట్టు పూడికతీత పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు సూచనల మేరకు రాజోలు నియోజకవర్గంలో అన్ని కాలువల్లో పనులు పొక్లెయిన్‌తో చెత్త, గుర్రపు డెక్క తొలగింపు చర్యలు చేపట్టామన్నారు. తహసీల్దారు జీవీఎల్ నరసింహారావు పర్యవేక్షణలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఎస్.రాకేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గుబ్బల రమేష్ పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యులు ఖండవల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు.

సస్యరక్షణ.. నష్ట నివారణ

- వర్షాలకు ముంపునకు గురైన ఉద్యాన పంటలు
- సంరక్షించుకోవాలని రైతులకు అధికారుల సూచనలు



అంబాజీపేటలో వర్షపు నీటిలో ఉన్న కొబ్బరి, కోకో తోట

అంబాజీపేట: ఉద్యాన పంటలను సస్యరక్షణ చర్యలు చేపట్టి నష్టాన్ని నివారించుకోవాలి. ఉద్యాన పంటలను సంరక్షించుకునేందుకు రైతులు అధికారుల సూచనలు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా పాటించాలి. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి. పంటలకు తెగుళ్లు సోకే అవకాశముంది. వాటిని సంరక్షించుకోవడానికి అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు పలు జాగ్రత్తలు వివరించారు.

కొబ్బరిలో..

కొబ్బరిలో మొవ్వు కుళ్లు సోకే ప్రమాదం ఉంది. ఫైటోఫ్తారా కుళ్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములను ఒక లీటరు నీటిలో కలిపి మొవ్వు భాగం, ఆకులు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి. కొబ్బరి మొక్క మొవ్వు భాగంలో సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ టాల్క్ పొడిని వేయాలి. మొక్క వయస్సును బట్టి సంవత్సరంలోపు మొక్కకు 5 గ్రాములను, ఒక ఏడాది మొక్కకు 10 గ్రాముల టాల్క్ పొడిని వేయాలి. 2 నుంచి 5 ఏళ్ల పైబడి ఉన్న మొక్కలకు 20 నుంచి 50 గ్రామాల పొడిని వేయాలన్నారు. కాయ కుళ్లు సోకిన గెలలను తొలగించి, ఇతర గెలలు మొవ్వు భాగం తడిచేలా 'సూడోమోనాస్ ఫ్లోరిసెస్' కల్చర్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. మొక్క వయస్సును బట్టి, పైన చెప్పిన మోతాదులలో సూడోమోనాస్ ఫ్లోరిసెస్ కల్చర్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

కోకోలో...

కోకోలో ఫైటోఫ్తారా కుళ్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి చెట్టు పళ్లెంలో చుట్టూ లీటరు ద్రావణము పోయాలి. కోకో చెట్టు కొమ్మలు కత్తిరింపు చేపట్టిన తోటలలో కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి కొమ్మలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.

అరటిలో...

నాలుగు రోజులు కంటే ఎక్కువ రోజులు నీటిలో మునిగిన మొక్కలు బతకడం కష్టం. అందువల్ల మురుగునీటి వసతి ఏర్పాటు చేయాలి. 3 నెలల వయసు కలిగిన అరటి మొక్కలు 3 అడుగుల లోతు నీటిలో మునిగిపోతే దుంపలు కుళ్లిపోతాయి. అందుకని కొత్త మొక్కలు నాటుకోవాలి. అంతర సేద్యం చేసి మొక్కకు రెండు మూడు సార్లు 100 గ్రాములు యూరియా, 80 గ్రాముల పొటాష్ వేయాలి. అరటి ఆకులు, గెలలపై 0.5 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. పక్వానికొచ్చిన అరటి గెలలను ఎండిన అరటి ఆకులతో కప్పి తయారైన తర్వాత అరటి గెలలను కోయాలి. అరటి చెట్లు పడిపోకుండా వెదురుగెడలతో ఊతమిచ్చి, మొక్కలు పడిపోకుండా చేసుకోవాలి. అరటి దుంపలు కుళ్ళిపోకుండా నివారించేయిందుకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములను ఒక లీటరు నీటికి కలిపి దుంప తడిచేటట్లుగా నేలలో పోయాలి. ఆకుమచ్చ తెగులును అరికట్టేందుకు ప్రొపికొనజోల్ ఒక మిల్లీ లీటరును ఒక లీటరు నీటిలో కలిపి ఒకటి లేదా రెండు పర్యాయాలు వారం రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

ప్రతి కుటుంబానికి ఆపద్బాంధవుడు జగన్



నగరంలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



సఖినేటిపల్లిలో పథకాలు వివరిస్తున్న పార్టీ శ్రేణులు

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- నగరంలో వై ఏపీ నీడ్స్ జగన్

మామిడికుదురు: సంక్షేమ పథకాలు అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి ఆపద్బాంధవుడిగా నిలిచారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలో ఎమ్మెల్యే చిట్టిబాబు పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వై ఏపీ నీడ్స్ జగన్ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఆర్థికంగా ఎన్ని సమస్యలు చుట్టుముట్టినా నాలుగున్నరేళ్ల పాలనలో ఎక్కడా మాట తప్పలేదన్నారు. ఇచ్చిన హామీల కన్నా ఎక్కువగా ప్రజలకు సంక్షేమ పాలన అందించారని చెప్పారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, జేసీఎస్ ఇన్‌చార్జి జక్కంపూడి వాసు, దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు సజ్జాద్ హుస్సేన్, కో-ఆప్షన్ సభ్యుడు నూరైన్ అబ్బాస్ పార్టీ నేతలు అన్వర్‌తాహిర్ హుస్సేన్, కడలి శ్రీనివాస్, జాలెం కృష్ణారావు, తవిటికి వెంకన్నబాబు, వానరాశి బాబి, కుడుపూడి బాలాజీ, కొంబత్తుల శ్రీనివాస్, కాలెపు కల్పన, నాగరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: స్థానిక సచివాలయ-1 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు నిర్వహించారు. మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, ఎంపీటీసీలు నల్లి రత్నకుమార్, కట్టా వెంకాయమ్మ కలిసి ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, విజయాలను తెలియజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ నల్లి మోహన్, నాయకులు రంగరాజు, సూరయ్య, రామరాజు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



పెదపళ్లలో ఘనంగా నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలు

ఆలమూరు: పెదపళ్లలోనున్న జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ఆవరణలో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. పాస్టర్ పి.దయాకర్, వసంత దంపతుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ పీఏసీఎస్ అధ్యక్షులు నెక్కంటి వెంకట్రాయుడు (బుజ్జి) ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేసిన అమలాపురానికి చెందిన పి.డేవిడ్ రాజు క్రైస్తవులకు క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. ఈసందర్భంగా క్రైస్తవ మత వ్యాప్తికి విశేష కృషి చేస్తూ అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న పాస్టర్ దయాకర్ దంపతులను గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు ఘనంగానా సన్మానించారు. మినిస్ట్రీస్ ప్రతినిధి పి.గాబ్రియేల్, సర్పంచ్‌లు ఏడిద సత్యశ్రీ, సంగిత సుభాష్, న్యాయవాది విద్యాప్రసన్న, వై.మెహెర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

రాజోలు: గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఆకుల విజయ్‌కుమార్, బోణం లక్ష్మిలకు చెందిన రెస్టారెంట్ కాలిబూడిదయ్యింది. రెస్టారెంట్‌లో ఉన్న సామాన్లు పూర్తిగా కాలిపోయాయని బాధితులు తెలిపారు. వారికి ప్రభుత్వ పరంగా 20 కేజీలు చొప్పున బియ్యాన్ని అధికారులు పంపిణీ చేశారు.

బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న అధికారులు →



లక్ష్మీనృసింహునికి జన్మ నక్షత్ర పూజలు



అంతర్వేదిలో పవిత్ర జలాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహస్వామి వారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం అష్టోత్తర శతకలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వార్యాన ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత వశిష్ట గోదావరి నది నుంచి కలశతో తెచ్చిన పవిత్ర జలాలను ఆలయ అర్చకుడు పెద్దింటి రామశేషాచార్యులు శిరస్సుపై ధరించి, అర్చకులతో కలిసి ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం వేద పండితుల వేదమంత్రోచ్ఛటన నడుమ 108 కలశాల్లోని పవిత్ర జలాలకు పూజలు చేశారు. తర్వాత వాటితో స్వామివారిని అభిషేకించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మృత్యుంజయ హోమం



మహా మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

రావులపాలెం: ఊబలంక సర్వ మంగళ సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మహా మృత్యుంజయ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు దేవరభట్ల రామ్మూర్తి, సూరిబాబు ఆధ్వర్యంలో స్థానిక శ్రీలక్ష్మీగణపతి కమిటీ పర్యవేక్షణలో ఈ హోమం జరిగింది. 365 మంది దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ప్రథమ జ్యోతిర్లింగం సోమనాథ నుంచి తీసుకువచ్చిన మృత్యుంజయ యంత్రం, అభిషేకించిన రుద్రాక్షన ఉంచి పండితులు పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ధన్వంతరి హోమం

అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ధర్మకర్త వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతులు ఆధ్వర్యంలో ఆదివారం ధన్వంతరి జయంతి సందర్భంగా హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం భారీ ఎత్తున అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

సరే.. వెళ్లి రా..!



రోజంతా అలసిపోయిన సూర్యుడు పశ్చిమానికి మళ్లాడు. ఈ రోజుకు సెలవు తీసుకొని వెళుతున్నాడు. ఈ క్రమంలో తనలో పలు వర్ణాలను పులుముకొని చూడముచ్చటగా ఆకర్షణీయంగా కనిపిస్తూ అందరినీ కనువిందు చేశాడు. స్థానిక కొత్త అక్విడెక్టుపై ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయం అందరినీ ఆకర్షించింది. అక్విడెక్టుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాల మధ్య నుంచి సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యాలు ప్రయాణికులను, స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

–పి.గన్నవరం

గోశాలకు ఎండుగడ్డి వితరణ



గోశాలకు ఎండుగడ్డి అందజేస్తున్న దాతలు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలోని గోశాలకు ఆదివారం అంతర్వేదిపాలెంకు చెందిన వీరా వెంకటమోహన్‌రావు, వీరాసాయి సుబ్బారావు ఎండుగడ్డిని వితరణ చేశారు. రూ.12 వేల విలువ చేసే ఈ ఎండిగడ్డిని గోశాల వద్ద ఆలయ సిబ్బంది గుత్తుల శ్రీనివాస్‌కు అందజేశారు.

మురుగును తొలగించండి



అల్లాడ స్వామి నాయుడు కాలనీలో నిలిచిన మురుగు

అంబాజీపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీ అంతా నీట మునిగి మురికికూపంలా మారింది. మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక ఇబ్బందులు పడుతున్నామని గంగలకుర్రు అగ్రహారం శివారు అల్లాడిస్వామి నాయుడు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లి దోమలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. కాలనీలో ఉన్న మురికినీటిని బయటకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు. మురుగునీటి నుంచి వచ్చే దుర్వాసనకు రోగాల బారిన పడకుండా పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని కోరారు.

బాల బాలాజీకి పూజలు

మామిడికుదురు: రాజోలు మండలం పొదలాడ నుంచి 41 మంది గోవింద మాలదారులు ఆదివారం పాదయాత్రగా అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి దర్శించి పూజలు చేశారు. పట్నాల దత్తాత్రేయ గురుస్వామి ఆధ్వర్యంలో సుమారు 15 కిలో మీటర్ల పాదయాత్ర చేసి అప్పనపల్లి చేరుకున్నారు. పాదయాత్రగా చేరుకున్న మాలధారులను ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దేశాభివృద్ధికి ప్రధాని మోదీ కృషి



దేశ నేతల వేషధారణలో ఉన్న విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆలమూరు: దేశ సమగ్రత అభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విశేష కృషి చేస్తున్నారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం అన్నారు. పెదపళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. సర్పంచ్ యేడిద సత్యశ్రీ, ఎంపీటీసీ నెక్కంటి ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొని ప్రసంగించారు. దేశంలో అన్ని వర్గాల అభ్యున్నతికి, పేదరిక నిర్మూలనకు 25 సంక్షేమ కార్యక్రమాలను ప్రధాని మోదీ అవినీతి రహితంగా అమలు చేస్తున్న విషయాన్ని అధికారులు క్షేత్ర స్థాయికి తీసుకు వెళ్లాలని వారు కోరారు. అనంతరం వికసిత భారత్ సంకల్ప యాత్ర వాహనం వద్ద విద్యార్థులు చేపట్టిన దేశ నేతల వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలను అందించారు. బీజేపీ నేతలు నాగిరెడ్డి స్వామి, బలుసు శ్రీనివాస్, ఏఎస్ఎం కె.ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వనభోజనాల సందడి



కొత్తపేట న్యూ బ్యాంక్ కాలనీ వన సమారాధనలో జన సందోహం



మహిళలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు



చింతలపల్లిలో ఎమ్మెల్యే సత్కరిస్తున్న రజక వెల్ఫేర్ సొసైటీ నాయకులు

- ఉసిరి చెట్టుకు పూజలు
- చిన్నారులకు ఆటపాటలు

కొత్తపేట: కార్తికమాసం ఆఖరి ఆదివారం కావడంతో ఎక్కడికక్కడ ప్రజలు వన వినోదాల్లో మునిగి తేలారు. పచ్చని ప్రకృతి ఒడిలో సేదతీరారు. చిన్నా పెద్దా అంతా సందడిగా చేశారు. సహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

అఖండ గోదావరి నది గౌతమీ, వశిష్ట నదులుగా వీడి కోనసీమ ప్రాంతానికి కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక ముఖద్వారం, గౌతమీ, వశిష్ట నదుల మధ్య ఆత్రేయపురం, పిచ్చుకలంక, రావులపాలెం, కొత్తపేట మండలాల్లోని పలు ప్రాంతాలు, ముఖ్యంగా సెంట్రల్ డెల్టా కాలువల మధ్య, వాటికి ఇరువైపులా ఉన్న లొల్ల లాకులు ప్రాంతం, లంక ప్రాంతాల్లో పచ్చని తోటల్లో వనభోజనాల సందడి కనిపించింది. మందపల్లి సమీపంలోని రాజుగారి తోట, కొత్తపేటకు సమీపంలోని ధనమ్మమర్రి, వానపల్లి పళ్లాలమ్మ ఆలయం, అవిడి-గంటి పెదపూడి మధ్య సత్తెమ్మతల్లి ఆలయం తదితర ప్రాంతాల్లో కార్తిక వనసమారాధనలు జరుపుకొన్నారు. కొత్తపేట కాపు కల్యాణ మండపం వద్ద..

మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పర్యవేక్షణలో కొత్తపేట కాపు సంఘం కాపు వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సత్యానందరావు ఉసిరి వృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకర్గ వ్యాప్తంగా కాపు నాయకులతో పాటు మండలంలో వివిధ గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో కాపు కులస్తులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక

స్థానిక న్యూ బ్యాంక్ కాలనీలో కుల, మత, వర్గాలకు అతీతంగా ఆ ప్రాంత యువకులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక మహిళలు ఉసిరి పూజ నిర్వహించారు. అనంతరం బాలలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, పలివెల దేవస్థానం చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లంకల గన్నవరం గ్రామంలోని డొక్కా వారితోటలో కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కాపు సంక్షేమ సంఘ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలమూరు: గ్రామాల్లో కార్తిక వన సమారాధనల సందడి నెలకొంది. జొన్నాడ, సంధిపూడి గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. తొలుత ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధనను ప్రారంభించారు. జొన్నాడలో శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద, సంధిపూడిలో పోలేరమ్మ ఆలయ సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీ ఆవరణలో అన్నసమారాధనలు జరిగాయి.

అంబాజీపేట: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం వనసమారాధనలు నిర్వహించారు. మాచవరం, పుల్లేటికుర్రు, ముక్కామల, ఇసుకపూడి, వాకలగరువు తదితర గ్రామాల్లో పలువురు కార్తిక వనసమారాధనలు చేపట్టారు. చిన్నారులు, పెద్దలు ఆటల పాటలతో ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు.

రాజోలు: వన సమారాధనలు ఐక్యతకు దోహదపడతాయని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం చింతలపల్లిలో రాజోలు నియోజకవర్గ రజక వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన రామలింగేశ్వర రజక అభివృద్ధి సొసైటీ భవనంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేను నిర్వాహకులు సత్కరించారు. సీహెచ్‌వీవీ సత్యనారాయణ, సాయి వెంకట కృష్ణ రమాదేవి దంపతులచే కార్తిక దామోదర స్వామికి పూజ, అర్చన నిర్వహించారు. వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా జ్యోతిబసు



రావులపాలెం: యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా రావులపాలెంకు చెందిన ఎస్.జ్యోతిబసు ఎన్నికైనట్టు ఆదివారం ఆయనే తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా కోనసీమ జిల్లా నుంచి తనను ఎన్నుకున్నారు. ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న జ్యోతిబస్సును ఈ నెల 9, 10 తేదీల్లో ఏలూరులో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జిల్లా ప్రతినిధిగా, రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికున్నట్టు తెలిపారు. జ్యోతిబస్సు మాట్లాడుతూ రాష్ట్ర సంఘం అప్పగించిన బాధ్యతను నమ్మకంతో పని చేస్తానన్నారు.